నేటి కందం- నేటికి అందం



ట్రినిడాడు టొబాగో లం
దున మోడీ పర్యటించి తుల లేని గతిన్
తనదైన శైలి యందున
మన ఘన సంస్కృతిని దెలిపి మన్నన నొందెన్ !!

ట్రినిడాడు టొబాగోలలో నేడు మోడీ పర్యటన



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 5-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:246 పేజీలు:6 వెల: రూ.1/-


## కారు ఢీకొని యువతికి తీవ్ర గాయాలు

హైదరాబాద్, జులై 4: ఓ వృద్ధుడు నడుపుతున్న కారు అదుపు తప్పి పలు వాహనాలకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ యువతి తీవ్ర గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన రాంగోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మారేడుపల్లికి చెందిన గోపాల్ చంద్రబోస్ (86) శుక్రవారం తన ఇంటి నుంచి ఈశ్వరీబాయి విగ్రహం మీదుగా బేగంపేట వెళుతున్నారు. ఈశ్వరీబాయి విగ్రహం దాటగానే ఆయన నడుపుతున్న వెర్నా కారు అదుపు తప్పి ఓ ద్విచ వాహనాన్ని ఢీకొట్టింది.

దీంతో ఆ వాహనం నడుపుతున్న మల్కాజ్గిరికి చెందిన రింకు (22) అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆ వృద్ధుడు మరింత భయంతో ముందుకు వెళ్లి మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటో, మరో ట్రాలీ ఆటోను కారుతో ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన యువతిని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించారు.


# రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

## -రోశయ్యకు ఘన నివాళులు

## -16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రోశయ్యకు అరుదైన రికార్డు

## -సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 4: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి



రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఎక్కువ సార్లు ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా పదవులను అలంకరించిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేశారు. లక్డీకాపూల్ లోని మెట్రో స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో తొమ్మిది అడుగుల ఎత్తు, 450 కిలోల బరువుతో కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. ఇవాళ రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.

### అరుదైన రికార్డు సాధించిన రోశయ్య..

ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16సార్లు ఆర్థికశాఖ మంత్రి హోదాలో రోశయ్య బడ్జెట్ ప్రవేశపెట్టి సరికొత్త రికార్డు సృష్టించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా ఎదిగారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. పదవులకే వన్నె తీసుకు వచ్చారన్నారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు .. 63 మంది మృతి

న్యూ ఢిల్లీ జూలై 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉత్తర భారతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురవడంతో వరదలు పొటెత్తాయి. ఈ వరదల కారణంగా 63 మంది చనిపోగా పదుల సంఖ్యలో గల్లంతయ్యారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు దాదాపుగా రూ.400 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వరదలో మృతిచెందిన వారి సంఖ్య వందకు పైగా ఉంటుందని స్థానిక మీడియా అంచనా వేస్తోంది.మండి జిల్లా నుంచి 17, కాంగ్రా(13), చంబా(06), సిమ్లా(05) ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద మందికి పైగా గాయపడినట్టు సమాచారం. భయకరంగా వరదలు పొటెత్తడంతో వందలాది ఇండ్లు ధ్వంసం కావడంతో పాటు 14 వంతెనాలు కొట్టుకొని పోయాయి. కొన్ని ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడడంతో పాటు వేల మంది ప్రజలు చలికి గజగజ వణికిపోతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రచారకర్తలు : రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జులై 4: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని, ప్రజా సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రభుత్వం తరపున ప్రచారకర్తలుగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ విజయభేరీ సభలో ఆయన కీలక ప్రసంగం చేశారు.



వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపీ సీట్లు పెరగబోతున్నాయని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలవబోతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాయని, అందులో ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యత అని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు తప్పకుండా గెలుస్తామని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

తన ప్రసంగంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నేతలను, కార్యకర్తలను ఉర్రూతలూగించారు. తమకు ఎదురులేదని భావించిన కల్వకుంట్ల గడీని బద్ధలు కొట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని, ఇదే తరహా పాలన రాబోయే రోజుల్లోనూ సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని, తామంతా కొట్టుకుంటామని.. కలసి ఉండలేమని విపక్షాలు చేసిన ఆరోపణలను తప్పని నిరూపించామన్నారు. కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో పని చేస్తూ అపోహలను పటాపంచలు చేశారన్నారు.

రైతు రాజ్యం ఎవరు తెచ్చారో ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం, చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి ఎవరొచ్చినా సరే.. మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నాం.. వారిని వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామన్నారు. జనగణనతో పాటు కులగణన చేస్తామని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించామన్నారు.

ఈ సమయంలో కష్టాలు వచ్చాయని, ఒడిదొడుకులు వచ్చాయని, అయినా అన్నింటిని అధిగమించి ముందుకెళ్తున్నామన్నారు.

జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం పార్టీ కార్యకర్తలేనని ప్రశంసించారు. రేవంత్‌రెడ్డి, భట్టి.. అందరూ కలిసికట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కేసీఆర్‌ను ఓడించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని కితాబిచ్చారు.

గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను బీఆర్?ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మోసం చేశారని ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు సన్నబియ్యం, రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పార్టీ నెరవేరుస్తోందని తెలిపారు. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమేనని, బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని గుర్తుచేశారు.

# భారతమాల రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరంగా పరిహారం: కలెక్టర్ సంతోష్



మహబూబ్‌నగర్,జులై 4:భారత్ మాలా రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరంగా నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయిన అయిజ మండలం బింగిదొడ్డి, జడ దొడ్డి గ్రామాల రైతులతో శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల నుంచి ప్రత్యక్షంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకూ న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు.

నష్టపరిహారాన్ని పెంచే దిశగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో చర్చలు జరుపుతు న్నామని, తగిన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రైతులు సర్వీస్ రోడ్ సమస్యను కలెక్టర్ దృష్టికి రాగా పరిశీలించి, అవసరమైతే మార్పులు చేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. రైతులు సహకరిస్తే మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆత్మనిర్భర్ కు కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ జూలై 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆత్మనిర్భర్ కు కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి ప్రసంగించారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోల్ ఇండియా చర్యలు చేపట్టిందని, అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాల ఉత్పత్తి జరుగుతుందని తెలియజేశారు. ఖనిజాల తవ్వకంలో కోల్ ఇండియా పారదర్శకంగా వ్యవహరిస్తోందని, 500 మినరల్స్ బ్లాక్స్ లో లీజ్ రెన్యువల్ సులభతరం చేసిందని చెప్పారు. లీజ్ రెన్యువల్ కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చిందని, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలోకి కోల్ ఇండియా అడుగు పెట్టిందని కిషన్ రెడ్డి ప్రశంసించారు.

# పదవులకే వన్నె తీసుకొచ్చిన గొప్ప నాయకుడు కొణిజేటి రోశయ్య : తలసాని

హైదరాబాద్, జులై 4: పదవులకే వన్నె తీసుకొచ్చిన గొప్ప నాయకుడు కొణిజేటి రోశయ్య అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మాజీమంత్రి రోశయ్య 92వ జయంతి సందర్భంగా అమీర్ పేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా హాస్పిటల్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం రోశయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ శాసన మండలి సభ్యుడిగా, ఎమ్మెల్యే గా, ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్ గా పనిచేసిన ఆయన విశేషమైన సేవలు అందించారని గుర్తు చేశారు. అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. ఎవరైనా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తారని, కానీ రోశయ్యను వెతుక్కుంటూ పదవులు వచ్చాయని పేర్కొన్నారు.

పదవులు అంకితభావంతో ఆయన చేసిన పనికి, కృషికి దక్కిన గౌరవాలుగా చెప్పారు. సనత్ నగర్ నియోజకవర్గ ఓటరుగా అమీర్ పేటలోనే నివాసం ఉండటం వలన తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. అనేక సందర్భాల్లో తనను నిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక కార్యక్రమాలు చేస్తున్నావని ప్రశంసించే వారని చెప్పారు. తెలుగుదనం ఉట్టి పడేలా వస్త్ర ధారణతో ఎంతో హుందాగా కనిపించే వారని తెలిపారు.

రాజకీయాల్లో అనేక మందికి రోశయ్య స్ఫూర్తి అని అన్నారు. నేచర్ క్యూర్ హాస్పిటల్ ను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో తాను సందర్శించగా సరైన సౌకర్యాలు, వసతులు లేక ఇతర రాష్ట్రాలకు ప్రకృతి వైద్యం కోసం వెళుతున్నారని తెలుసుకున్నానని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరు చేయించి ఎంతో గొప్పగా అభివృద్ధి చేసి ఆరోగ్య శాఖ మంత్రిగా హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా అవసరమైన సౌకర్యాలు, హాస్పిటల్ అభివృద్ధి విషయంలో తన సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, హాస్పిటల్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్, అమీర్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఆకుల రాజు, శివ, ఉత్తమ్ కుమార్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ లో ఫ్రీ వైఫై..

## -ప్రయాణికుల కోసం డిజిటల్ మార్గంలో మరో ముందడుగు

హైదరాబాద్, జులై 4:తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకీకరించడమేకాక, ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులు, బస్ స్టాపులలో ఉచిత వైఫై సేవలు అందించనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది.

ఈ డిజిటల్ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఖీఅ ఒక ప్రైవేట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సహకారంతో, ప్రయాణీకులు ప్రయాణించేటప్పుడు లేదా బస్సు కోసం వేచి ఉన్నప్పుడు ఎక్కడైనా అంతరాయం లేని ఇంటర్నెట్ కనెక్టివిటీని పొందగలుగుతారు. ఈ ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక అంశాలను ఇప్పటికే ప్రతిపాదన రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో జరిగిన ఓ సమావేశంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ ప్రణాళికను వివరించారు. ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలను చూసిన తర్వాత మంత్రులు అధికారికంగా ఈ ప్రాజెక్టును ఆమోదించడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి తొలి అడుగు పడింది.

వైఫై సేవల ద్వారా ప్రయాణికులకు అందే సౌకర్యాలు

ప్రాజెక్ట్ తొలి దశలో, ప్రయాణీకులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా సినిమాలు, పాటలు వంటి వినోద కార్యక్రమాలను ఉచితంగా చూసే అవకాశం ఉంటుంది. తరువాతి దశల్లో పూర్తి ఇంటర్నెట్ బ్రౌజింగ్ కూడా అందుబాటులో ఉంటుంది.

అయితే, ఈ సేవలను ఉపయోగిస్తున్నప్పుడు వినియోగదారులు కొన్ని ప్రకటనలను వీక్షించాల్సి ఉంటుంది. ఇది ప్రాజెక్ట్ ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉండటానికి అనుమతిస్తుంది.ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా, ఈ వైఫై ప్రాజెక్ట్ ఖీఅకి కొత్త ఆదాయ మార్గాలను తెరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖీఅ, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల పరస్పరం పంచుకుంటాయి. ఇది సంస్థ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో దోహదపడుతుంది.

# అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

నల్గొండ, జులై 4:అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోగారం గ్రామానికి చెందిన బద్దుల రాజు (34) గ్రామ శివారులో గల ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. పంట పెట్టుబడికి, బోరు మోటారు కోసం గ్రామంలో గత సంవత్సరం రెండు లక్షల వరకు అప్పు చేశాడు.

పంట సరిగ్గా రాకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు.

చేసిన అప్పులు అలాగే పెరిగిపోతుండడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 9 గంటలకు గడ్డి మందు తాగాడు. ఇంటి పక్కన ఉన్న మహిళ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం రామన్నపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ దవాఖానాకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మధ్యాహ్న సమయంలో మృతి చెందాడు. భార్య లలిత ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేశారు.

తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ సాహిత్య అకాడమి
నిర్వహించు
సాహిత్యవారం




కరిపె రాజ్‌కుమార్ రచన
గెర్నికా
కవితా సంపుటి
ఆవిష్కరణ & పరిచయం

సభాధ్యక్షులు
డా.నామోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

ముఖ్య అతిథి & పుస్తక ఆవిష్కర్త
డా.కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, సాహితీవేత్త

పుస్తక పరిచయం
మౌనశ్రీ మల్లిక్, సినీ గేయ రచయిత

వేదిక:
తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం,
రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500 004
తేదీ: 05.07.2025 (శనివారం), సమయం : సా॥ 4.00 గంటలకు

సాహితీప్రియులందరికీ సాదర ఆహ్వానం..
వివరాలకు : 040 - 29703142

# సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల

నల్గొండ, జులై 4: తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వకు ఎన్‌ఎస్పీ అధికారులు శుక్రవారం నీరు విడుదల చేశారు. వెయ్యి క్యూసెక్కులతో ఎడమ కాల్వకు నీటి విడుదలను ప్రారంభించి క్రమంగా నీటి విడుదలను పెంచుకుంటూ 3 వేల క్యూసెక్కులతో కొనసాగిస్తామన్నారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ నింపడానికి 1 టీఎంసీ నీటిని కేటాయించినట్లు, ఒక టీఎంసీ మేర నీటి విడుదల ఎడమ కాల్వకు కొనసాగుతుందన్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గాను 522.20 అడుగుల వద్ద 153.3180 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వ ద్వారా 1,623 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. కుడి కాల్వ, జలవిద్యుత్ కేంద్రాల ద్వారా నీటి విడుదల లేదు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుండి 2,523 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొన సాగుతుండగా, 54,051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం ద్వారా నాగార్జునసాగర్ రిజర్వా యర్‌కు వచ్చి చేరుతుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ గరిష్ట నీటి మట్టం 885 అడు గులకు గాను 875.90 (167.8 746 టీఎంసీల) అడుగులకు మేర నీరు చేరింది.

# ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాల మద్దతు

హనుమకొండ, జులై 04: నెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించతలపెట్టిన సమ్మెకు వామపక్ష పార్టీల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ, సీపీఎం, న్యూడెమొక్రసీ, ఆర్‌ఎస్పీ పార్టీల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి ఎనిమిది గంటల పని విధానాన్ని ఎత్తివేయడంతో పాటు కార్మికుల సమ్మె హక్కులను కాలరాసే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడం సరికాదని అన్నారు. లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ప్రకటిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ

మ్మెకు అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు కలిసి రావాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..గత మూడున్నర దశాబ్దాలలో కేంద్రంలో పాలక వర్గాలు కార్మిక హక్కులపై ఏదో ఒక స్థాయిలో దాడి చేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీలకు పూర్తి మెజారిటీ లేకపోయినా ప్రతిపక్షంలో ఉన్న బూర్జువా పార్టీల సహకారంతో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల అమలుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించే నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటిస్తూ అప్రజాస్వామికంగా తెచ్చిన 4 లేబర్ కోడ్ల రద్దుకై 2025 జూలై 9న కార్మికవర్గం మరో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధమైందని, ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెతో సహా పెద్దఎత్తున దేశవ్యాప్త ఉద్యమానికి 10 కేంద్ర కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు పిలుపునిచ్చాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఎం జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, ఎం. చుక్కయ్య, గొడుగు వెంకట్, న్యూడెమొక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, నున్నా అప్పారావు, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి కౌడగాని శివాజీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మునగాల బిక్షపతి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, ఏదునూరి వెంకట్రాజం, మాలోతు శంకర్ నాయక్, బొట్టు బిక్షపతి, గోకల రాజయ్య, మహేందర్, పసునూరి సునిల్ తదితరులు పాల్గొన్నారు.

# 'జీతం' మాత్రమే 'జీవితం' అవుతుందా !

## (05 జూలై "జాతీయ వర్క్‌హాలిక్స్ (అధిక సమయం పని చేసే వారి) దినం" సందర్భంగా)

కొందరు వృత్తి సంబంధ పనుల్లో తనమునకలై, తమ వ్యక్తిగత పనులనే కాదు తమ కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేస్తూ అనేక ఇతర సమస్యలను ఎదుర్కొంటారు. ఇలాంటి అతిగా పని చేసే వారిని మనం సాధారణంగా పని రాక్షసులుగా పిలుస్తాం. అధిక సమయం వృత్తి లేదా ఉద్యోగ ఉపాధులకే కేటాయిస్తూ, తమను తాము మరిచిపోయి పలు అనారోగ్య సమస్యలకు కూడా లోనవుతున్నారు. వీరిని 'వర్క్‌హాలిక్స్' అని పిలవడం పరిపాటిగా మారింది. 'వర్క్', 'ఆల్కహాల్' అను పదాల కలయికతో ఏర్పడిన 'వర్క్‌హాలిక్స్' గుణం కలిగి ఉన్న వ్యక్తులు వృత్తి ఉద్యోగ ఉపాధుల పనిల్లో మాత్రమే మునిగిపోయి తనను తాను మరిచి పోయి, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, తమ వ్యక్తిగత జీవితాలకు సహితం దూరమై తమ తమ జీవితాలను దుర్భరంగా మార్చుకుంటూ, అనారోగ్యాల బారిన పడడం చూస్తున్నాం. వృత్తికి సంబంధించిన పనులను చేయాలి కాని వ్యక్తిగత జీవితానికి, కుటుంబ సభ్యులకు కూడా తగిన సమయం కూడా కేటాయిస్తూ సమతుల్యతలను సాధించడమే అసలైన జీవన మాధుర్యమని తెలుసుకోవాలి.

జాతీయ వర్క్‌హాలిక్స్ దినం:

పనికి అనవసర అధిక సమయాలను కేటాయించడం, పని గంటలను మరిచి పనిలో మునిగి పోవడం లాంటి గుణాలు తమ జీవితాలను దుఃఖముతో చేస్తాయని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 05 జూలైన ప్రపంచ దేశాలు "జాతీయ వర్క్‌హాలిక్స్ దినం" లేదా "జాతీయ అతిగా పని చేసే వారి దినం"గా పాటిస్తారు. ఇలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు తమకు కేటాయించిన సమయంలో మాత్రమే పని చేస్తూ, వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలకు తగు సమయాన్ని కేటాయిస్తూ జీవితంలో పనికి, ఇతర అంశాలకు సమతుల్యత సాధిస్తూ, సంతోష ఆరోగ్యకర జీవితాలను గడపడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాలి. మన పనులను ప్రాధాన్యతాక్రమంలో నిర్ణయించుకొని అన్నింటికీ తగిన సమయం కేటాయించాలి. మనం వృత్తి పనులు చేయడానికి మాత్రమే కాదని గమనించాలి.

ఓవర్ టైమ్ పనిలోనే మునిగితే జరిగే అనర్థాలు:

మనకంటూ ఒక వ్యక్తిగత జీవితం ఉంది. మనకు కూడా అభిరుచులు ఉంటాయి. మనకు కూడా అందరితో కలిసి ఆనందంగా జీవించాలని ఉంటుంది. అభిరుచులను తీర్చుకోవాలని ఉంటుంది. మన కుటుంబాన్ని, సంతానాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలని కూడా ఉంటుంది. జీవనోపాధికి ఏదో ఒక వృత్తిని ఎంచుకుంటాం. దాని నుంచి లభించే జీతంతో మనదైన జీవితాలను గడుపుతాం. జీతం మాత్రమే జీవితం కాదని తెలుసుకోవాలి. వృత్తి పనుల్లో అధిక సమయం కేటాయించడం ఉత్తమం కాదు. మనకు కేటాయించిన దాదాపు 8 గంటల సమయంలో మాత్రమే ఏకాగ్రతతో పని చేయాలి, ఉత్తమ ఫలితాలను సాధించాలి. అధిక సమయం పని చేస్తే ఏకాగ్రత లోపించి తక్కువ ఫలితాలు లేదా ఎక్కువ తప్పులు జరుగుతాయి. దీనితో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిద్రలేమి, అలసట, తలనొప్పి లాంటివి ఆవహిస్తాయి. అనారోగ్యం మనల్ని ఆక్రమిస్తుంది. ఓవర్ వర్క్ మనశ్శాంతిని హరిస్తుంది. సంస్థలో చెడ్డ పేరు తెస్తుంది.

మనం వృత్తిలో పని గంటలను పాటిద్దాం. సహచర ఉద్యోగులతో సరదాగా కలిసి పని చేద్దాం, పనితో ఏకాగ్రతను పెంచుకుంటూ సాఫల్యత సాదిద్దాం. సమయానుకూలంగా కుటుంబంతో కలిసి వినోదాలు, విందులు, యాత్రలకు ప్రణాళికలు వేద్దాం. జీవితాన్ని సమతుల్యతతో సంతోషాలు నిండిన మహాభాగ్యంగా మలుచుకుందాం. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలుసుకుందాం. ఆరోగ్యానికి కొంత సమయాన్ని పెట్టుబడిగా పెడదాం. ఆరోగ్యం ఉంటేనే వృత్తి ఉద్యోగాలని తెలుసుకుందాం. వర్క్-లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటూ ఆనంద సుగంధాలతో జీవితాలను కొనసాగిద్దాం. అందరూ మెచ్చే విధంగా జీవనశైలినా మార్చుకుందాం.

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700047

# మాజీ మంత్రి దయాకర్ రావు జన్మదిన వేడుకలు



మహబూబాబాద్, జులై 4:(నేటినిజం ప్రతినిధి): జన హృదయ నేత బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి,రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు 70 వ జన్మదినం సందర్భంగా పెద్దవంగర మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎన్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి,పండ్ల పంపిణీ చేసి,మొక్కలు నాటి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు అయిలయ్య మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిన ఘనత వీరికే దక్కిందని అన్నారు. పెద్దవంగర మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేయటమే కాకుండా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు బీటీ రోడ్డు డబుల్ బెడ్రూమ్స్ నూతన గ్రామ పంచాయతీలు గ్రామాల్లో కమ్యూనిట్టి హాల్స్ ప్రజలకు కావలసిన అవసరాలను కల్పించిన గొప్ప నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ,ప్రధానకార్యదర్శి శ్రీరాం సంజయ్, మండల నాయకులు శ్రీరాం సుధీర్,దుంపల సమ్మయ్య, చింతల భాస్కర్, ధరవత్ రాజేందర్,ధరవత్ బీమా,గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మల విజయశ్రీనివాస్,కుకట్ల వీరన్న,మండల యూత్ అధ్యక్షులు కాసాని హరీష్, ఎర్రసాని రామ్మూర్తి,చిలుక భిక్షపతి,గద్దలవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రాలోని ఎన్క్రుమా సంస్మరణ వాటికలో నివాళులర్పించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 4:ఘనా దేశం ఆక్రా నగరంలోని ఎన్క్రుమా సంస్కరణ వాటికను సందర్శించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ... దివంగత నేత, ఆఫ్రికా స్వాతంత్ర్య వీరుడు, దేశాన్ని ఉనికిలోకి తెచ్చిన తొలి దేశాధ్యక్షుడు డాక్టర్ క్వామే ఎన్క్రుమాకు ఘన నివాళులు అర్పించారు. ఘనా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ నానా జేన్ ఓపుకు-ఆగ్యేమాంగ్ ప్రధాని వెంట ఉన్నారు. స్వాతంత్ర్యం, ఐక్యత, సామాజిక న్యాయం వంటి ఆశయాల సాధనకు డాక్టర్ ఎన్క్రుమా చేసిన కృషిని, ఆయా రంగాలపై చెక్కుచెదరని ఆయన ప్రభావానికి గౌరవ సూచకంగా శ్రీ మోదీ పుష్ప గుచ్ఛాన్ని ఉంచి మౌనం పాటించారు.

ఘనా దేశ ఘన చారిత్రిక వారసత్వం పట్ల భారత్ కు గల గౌరవాన్ని ప్రధాని నివాళి ప్రతిబింబించింది. ఇరు దేశాల మధ్య గల దృఢమైన స్నేహ బంధాలు, సహకార స్ఫూర్తిని పునరుద్ఘాటించింది.

# తెలంగాణ గవర్నరుతోనూ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోనూ మిషన్ కర్మయోగి బృందం భేటీ



న్యూఢిల్లీ, జులై 4:తెలంగాణ గవర్నరు శ్రీ జిష్ణు దేవ్ వర్మతో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌తో పాటు కర్మయోగి భారత్‌కు చెందిన మిషన్ కర్మయోగి బృందం హైదరాబాద్‌లో బుధవారం (2025 జులై 2న) సమావేశమైంది. ఈ బృందానికి కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ డైరెక్టరు నవ్‌నీత్ కౌర్‌తో పాటు అదే కమిషన్‌లో పరిపాలన విభాగ సభ్యురాలుగా ఉన్న డాక్టర్ అల్కా మిట్టల్ నేతృత్వం వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మిషన్ కర్మయోగి అమలవుతున్న తీరుతెన్నులను ఈ బృందం గవర్నరుకు వివరించింది. ఈ కార్యక్రమానికి తన మద్దతు ఉంటుందని గవర్నరు అన్నారు. రాష్ట్రంలో మార్పు దిశగా మిషన్ సాగిస్తున్న ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకుపోవాల్సిందిగా బృందాన్ని ఆయన ప్రోత్సహించారు.

అంతకు ముందు, తెలంగాణలో ప్రభుత్వోద్యోగుల సామర్థ్యాలకు ఏయే విధాలుగా మరిన్ని మెరుగులు దిద్దవచ్చో ఒక మార్గసూచీని రూపొందించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావుతో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో మిషన్ కర్మయోగి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా మిషన్ కర్మయోగి గురించిన సమగ్ర వివరాలను ఈ బృందం వివరించింది.

డిజిటల్ మాధ్యమ శక్తియుక్తులను సద్వినియోగపరుచుకోవడం, సామర్థ్యాలకు సాన పట్టుకొనే శిక్షణను పొందడం ద్వారా భవిష్యత్తులో ఎదురుకాగల వినూత్న అవసరాలకు అనుగుణంగా, పౌరుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ వారికి రకరకాల సేవలను అందించాలన్నదే తమ మిషన్ లక్ష్యమని బృందం స్పష్టం చేసింది.

చర్చల్లో 'ఐగాట్ కర్మయోగి' వేదిక ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ వేదిక అన్ని విభాగాల్లోనూ అధికారులకు 'ఎప్పుడైనా, ఎక్కడైనా' ప్రాతిపదికన జ్ఞానాన్ని సంపాదించుకొనేందుకు బాటవేస్తోంది. విభాగాల అధిపతులు తమకు ఎదురవుతున్న సవాళ్లను, తమకు ప్రత్యేక శిక్షణను అందించాల్సిన అవసరాన్నీ వివరించారు.

ప్రతి ఒక్క విభాగానికీ దానికంటూ నిర్దేశించిన పరిపాలక ప్రాధాన్యాలకు అనుగుణంగా ఉండే, విషయాలను నేర్చుకొనే పద్ధతులను రూపొందించడానికి పెద్దపీట వేయాలని వారు కోరారు. వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వోద్యోగులను ఐగాట్ వేదికపైకి తేవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయమిది. ఈ నిర్ణయంతో తెలంగాణలో సామర్థ్యాల పెంపు దిశగా సాగుతున్న ప్రస్థానంలో ఒక ముఖ్యమైన ముందడుగును వేసినట్లయింది.

గవర్నరు, చీఫ్ సెక్రటరీలతో పాటు తెలంగాణ పరిపాలక యంత్రాంగం అందించిన మద్దతుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ హృదయపూర్వకంగా ప్రశంసలు తెలిపింది. మిషన్ కర్మయోగిలో భాగంగా జ్ఞానార్జన, అభివృద్ధి మార్గాల్లో పరిపాలనను బలోపేతం చేయాలన్న ఉమ్మడి నిబద్ధతకు ఈ ప్రయత్నాలు అద్దం పట్టాయి.

# కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి ఈఎల్ఐ పథకం ద్వారా విస్తృత ప్రయోజనాలు: ప్రాంతీయ పి ఎఫ్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్




న్యూఢిల్లీ, జులై 4:కొత్తగా చేరబోయే ఉద్యోగులు కేంద్రం ఇటీవల ఆమోదించిన ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఇఎల్ఐ) పథకం ప్రయోజనాలను పొందాలని ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీ అబ్దుల్ ఖాదర్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నూతన ఇఎల్ఐ పథకం గురించి వివరించారు. రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 3.5 కోట్లకు పైగా ఉపాధి అవకాశాలను సృష్టించడమే దీని లక్ష్యమని తెలిపారు.

తయారీ రంగంలో కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో ఈ పథకం సహాయపడుతుందని ఖాదర్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావిస్తూ, త్రైమాసికానికి సగటున పది వేల మందితో, "ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం 76,49,844 మంది ఉద్యోగులు ఈపిఎఫ్ఒ లో చేరారని" ఆయన అన్నారు. అయితే, ఈఎల్ఐ పథకం కొత్త నియామకాలకు మాత్రమే వర్తిస్తుందని, ఉద్యోగులు లేదా యజమానులు ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి మరియు ప్రయోజనాలను పొందడానికి https://shramsuvi dha. gov .in/homeని సందర్శించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

"ఈ పథకం దేశంలోని 1.92 కోట్ల మంది మొదటిసారి కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ పథకం కింద ఉద్యోగి ప్రోత్సాహకంగా 15,000 వరకు ఒక నెల జీతాన్ని రెండు విడతలలో పొందుతారు. పారదర్శకత, సౌలభ్యం కోసం ఆధార్-లింక్ చేయబడిన ఉద్యోగి ఖాతాలకు మరియు పాన్-లింక్ చేయబడిన యజమాని ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తారని కమిషనర్ శ్రీ ఖాదర్ తెలిపారు.

ఒక లక్ష వరకు జీతం ఉన్న ఉద్యోగులకు సంబంధించి యజమానులు కూడా ప్రోత్సాహకాలను పొందుతారు. కనీసం ఆరు నెలల పాటు స్థిరమైన ఉపాధి ఉన్న ప్రతి అదనపు ఉద్యోగికి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు నెలకు మూడు వేల వరకు యజమానులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. తయారీ రంగం ఉద్యోగులకు సంబంధించి మూడవ మరియు నాల్గవ సంవత్సరాలలో కూడా ప్రోత్సాహకాలను పొడిగిస్తామని శ్రీ ఖాదర్ తెలిపారు.

ఈ సమావేశంలో పిఐబి డైరెక్టర్ పి రత్నాకర్, ఈపిఎఫ్ఒ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

### –నీటిని విడుదల చేసేందుకు వచ్చిన సీపీఎం నాయకులు..
### –అడ్డుకున్న పోలీసులు



నంద్యాల, జులై 4 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. శ్రీశైలం జలాశయంలోకి వరద నీరు ఉధృతంగా వస్తుంది.. రాయలసీమ కు తలమానికమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని వదలాలని సీపీఎం నాయకులు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని కిందకు విడుదల చేసేందుకు శుక్రవారం పోతిరెడ్డిపాడు వద్దకు వచ్చారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు సీపీఎం నాయకులు రైతులతో కలిసి పెద్దఎత్తున ప్రాజెక్టు దగ్గరకు వచ్చారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. ధర్నాతో నిరసన వ్యక్తం చేశారు.

నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నించిన సీపీఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సీపీఎం నాయకుల మధ్య తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సీపీఎం నాయకులను అరెస్ట్ చేసి బలవంతంగా స్టేషన్ కు తరలించారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854 అడుగులు దాటి 20 రోజులు గడిచినా ప్రభుత్వం మొదటి నుంచి నీటిని విడుదల చేయడం లేదని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులు పంటలు వేసుకునే నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

అధికారులను నీటిని విడుదల చేయాలని అడగగా, మరో వారం రోజుల నుండి విడుదల చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు చేరుకుందన్నారు. మొదటి నుంచి నీటి విడుదల చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాయలసీమ పై నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రజలు, సంబంధిత వ్యక్తుల అభిప్రాయాల కోసం 30 రోజుల పాటు వారికి అందుబాటులో ముసాయిదా టీఆర్‌పీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జులై 4:దేశంలో ఇటీవల టెలివిజన్ వీక్షణ అలవాట్లలో గణనీయమైన మార్పు వచ్చింది. ప్రేక్షకులు ఇప్పుడు కేబుల్, డీటీహెచ్ వేదికల ద్వారా మాత్రమే కాకుండా స్మార్ట్ టీవీలు, మొబైల్ అప్లికేషన్లు, ఇతర ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వేదికల ద్వారా కూడా కార్యక్రమాలను చూస్తున్నారు. అయితే వీక్షకుల సంఖ్యను కొలిచేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న టెలివిజన్ రేటింగ్ పాయింట్ల (టీఆర్‌పీ) వ్యవస్థ.. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఈ నమూనాలను పూర్తిగా సంగ్రహించలేదు.

అందువల్ల 2014లో జారీ చేసిన టెలివిజన్ రేటింగ్ ఏజెన్సీల కోసం ఉద్దేశించిన విధానపరమైన మార్గదర్శకాల్లో పలు సవరణలను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ నెల 2న విడుదలైన ప్రతిపాదిత ముసాయిదా ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న బీఏఆర్‌సీ మాత్రమే కాకుండా మరిన్ని సంస్థలను దేశంలోని టెలివిజన్ ప్రేక్షకుల కొలమాన రంగంలోకి అనుమతించేందుకు మీడియా సంస్థలకున్న అడ్డంకులు తొలగిపోతాయి. ఇది ఈ వ్యవస్థను మరింత ప్రజాస్వామ్యీకరిండానికీ, ఆధునీకరించడానికీ ఉపయోగపడుతుంది.

ముసాయిదా జారీ చేసిన 30 రోజుల్లోపు సంబంధిత వ్యక్తులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియపరచాలని మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది. సంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించడం, మరింత కచ్చితమైన.. ప్రాతినిధ్య డేటాను రూపొందించడం, దేశవ్యాప్తంగా వీక్షకుల వైవిధ్యమైన, అభివృద్ధి చెందుతున్న మీడియా వినియోగ అలవాట్లను సరిగ్గా సూచించేలా చేయడం ఈ ప్రతిపాదిత సంస్కరణల లక్ష్యం.

మరింత ప్రాతినిధ్యంతో కూడిన ఆధునిక టీఆర్‌పీ వ్యవస్థ అవసరం

దేశంలో ప్రస్తుతం దాదాపు 230 మిలియన్ల గృహాల్లో టెలివిజన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం వీక్షకుల డేటాను సంగ్రహించేందుకు దాదాపు 58,000 మీటర్లు మాత్రమే ఉన్నాయి. ఇది టీవీలు ఉన్న మొత్తం గృహాల్లో కేవలం 0.025 శాతం మాత్రమే. ఈ పరిమిత శాంపిల్ సైజ్.. వివిధ ప్రాంతాల, జనుల విస్తృత వీక్షణ ప్రాధాన్యాలను సరైన విధంగా సూచించకపోవచ్చు.

పైగా ప్రేక్షకులు అత్యధికంగా ఉపయోగిస్తున్న స్మార్ట్ టీవీలు, స్ట్రీమింగ్ పరికరాలు, మొబైల్ అప్లికేషన్‌ల వంటి అభివృద్ధి చెందుతున్న వేదికల వీక్షకుల సంఖ్యను ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్రేక్షకుల కొలమాన సాంకేతికత సరిగ్గా సంగ్రహించలేదు. అభివృద్ధి చెందుతున్న వీక్షణ విధానాలు, ప్రస్తుత కొలమాన ప్రణాళికల మధ్య ఈ అంతరం రేటింగ్‌ల కచ్చితత్వాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది ప్రసారకర్తల ఆదాయ ప్రణాళికలనూ, బ్రాండ్‌ల ప్రచార వ్యూహాలనూ ప్రభావితం చేస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో విస్తృతమైన మీడియా రంగంలోని సమకాలీన కంటెంట్ వినియోగ అలవాట్లను మెరుగ్గా ప్రతిబింబించేలా టెలివిజన్ రేటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరముంది.

కంపెనీ మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎమ్ఓఏ)లో కన్సల్టెన్సీ లేదా సలహా సేవలు వంటి ఏ అంశాన్నీ చేర్చకూడదన్న నిబంధన స్థానంలో... "కంపెనీ సలహాలు లేదా అటువంటి సలహా సేవలు వంటి ఏ కార్యకలాపాలను చేపట్టకూడదు. పరస్పర ప్రయోజనానికి అవకాశం ఉన్న కారణంగా ఇది రేటింగ్ ఇచ్చే ప్రధాన లక్ష్యం విషయంలో రాజీపడేలా చేయవచ్చు" అనే సులభంగా పాటించగల నిబంధనను పేర్కొంటూ.. నిబంధన 1.4లో మార్పు చేసింది. బహుళ ఏజెన్సీల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడం, ముఖ్యంగా కనెక్టెడ్ టీవీ ప్లాట్‌ఫామ్‌ల కోసం మరింత విశ్వసనీయమైన, ప్రాతినిధ్య డేటాను అందించేందుకు అనుమతించడం ప్రతిపాదిత సవరణల లక్ష్యం.

## దేశీయ కేటగిరీ (ఐడీడీఎం) కింద దాదాపు రూ.1.05 లక్షల కోట్ల విలువైన 10 కీలక కొనుగోళ్ల ప్రతిపాదనలకు 'డీఏసీ' ఆమోదం

న్యూఢిల్లీ, జులై 4:రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఇవాళ (జూలై 3న) రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశమైంది. ఈ సందర్భంగా స్వదేశీ వనరుల ద్వారా సైనిక అవసరాలకు ఆమోదం (ఏఓఎన్) కింద దాదాపు రూ. 1.05 లక్షల కోట్ల విలువైన 10 కీలక కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు "ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్, త్రివిధ దళాల కోసం ఇంటిగ్రేటెడ్ కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణుల" కొనుగోళ్లకు 'ఏఓఎన్'లకు 'డీఏసీ' అంగీకారం తెలిపింది. ఈ కొనుగోళ్లతో సాయుధ దళాలకు అధిక చలనశీలత, సమర్థ గగనతల రక్షణ, మెరుగైన సరఫరా వ్యవస్థల నిర్వహణ, సిబ్బంది కార్యాచరణ సంసిద్ధత మరింత ఇవే కాకుండా "మూర్డ్ మైన్స్, మైన్ కౌంటర్ మెజర్ వెసల్స్, సూపర్ రాపిడ్ గన్ మౌంట్, సబ్ మెర్సిబుల్ అటానమస్ వెసల్స్" కొనుగోళ్లకూ ఆమోదముద్ర పడింది.

ఈ కొనుగోళ్లతో నావికాదళ, వ్యాపార నౌకలకు ఎదురయ్యే ముప్పులను తగ్గించే వీలు కలుగుతుంది. స్వదేశీ డిజైన్, అభివృద్ధిని మరింత ప్రోత్సహించడంలో భాగంగా (భారతీయ-స్వదేశీ ప్రణాళిక, రూపకల్పన, తయారీ ద్వారా) ఆయుధ పరికరాలు రూపొందించే కేటగిరీ కింద 'ఏఓఎన్'లకు మండలి ఆమోదం తెలిపింది.



# ఘనా అధ్యక్షునితో ప్రధానమంత్రి సమావేశం

న్యూఢిల్లీ, జులై 4:ఘనా అధ్యక్షుడు డాక్టర్ జాన్ డ్రమానీ మహామాతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. జూబ్లీ హౌస్‌కు చేరుకున్న ప్రధానికి అధ్యక్షుడు మహామా స్వాగతం పలికారు. గడచిన మూడు దశాబ్దాల్లో ఘనాలో అధికారికంగా ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి.

పరిమితమైన, ప్రతినిధి స్థాయిలో జరిగిన సమావేశాల్లో ఇద్దరు నాయకులు విస్తృతంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సంబంధాలను సమగ్ర భాగస్వామ్యంగా మార్చేందుకు వారు అంగీకరించారు. భారత్, ఘనా దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న సంబంధాలను పునరుద్ఘాటించారు. అలాగే వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, సామర్థ్య నిర్మాణం, డిజిటల్ టెక్నాలజీ, మౌలిక వసతులు, యూపీఐ, నైపుణ్యాభివృద్ధి, ప్రజల మధ్య సంబంధాలు తదితర కీలకమైన రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై చర్చించారు. పెరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్యం, ఘనాలో భారత్ పెట్టుబడులను వారు స్వాగతించారు. రక్షణ, భద్రతా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై నాయకులిద్దరూ చర్చించారు. అభివృద్ధి సహకార భాగస్వామ్యాన్ని ముఖ్యంగా భారత్ మద్దతు ఇస్తున్న మౌలిక వసతులు, సామర్థ్య నిర్మాణ ప్రాజెక్టులను మరింత బలోపేతం చేయడానికి వారు కట్టుబడి ఉన్నారు. ఆరోగ్యం, ఫార్మా, డిజిటల్ ప్రజా మౌలిక వసతులు, యూపీఐ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తన అనుభవాన్ని పంచుకోవడానికి భారత్ ముందుకొచ్చింది. గ్లోబల్ సౌత్ ఆందోళనలను వినిపించడంలో భారత్ నిబద్ధతను ప్రధానమంత్రి తెలియజేశారు. ఈ విషయంలో ఘనా అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఘనాలో నివసిస్తున్న 15,000 మంది భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు అధ్యక్షుడు మహామాకు ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఐక్యరాజ్యసమితి సంస్కరణలతో సహా ఉమ్మడి ఆసక్తి ఉన్న అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నాయకులు చర్చించారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో మద్దతు, సంఘీభావం తెలియజేసిన అధ్యక్షుడు మహామాకు ప్రధాని ధన్యవాదాలు చెప్పారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో సభ్యత్వం, కామన్వెల్త్ కార్యదర్శిగా ఘనా విదేశాంగ మంత్రి ఎన్నికవడంతో సహా అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని విస్తరించుకుంటున్న ఘనాకు ప్రధాని శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామ్య విలువలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారం, సుస్థిరాభివృద్ధి, ప్రపంచ శాంతి విషయంలో ఉమ్మడి లక్ష్యానికి కట్టుబడి ఉంటామని నాయకులిద్దరూ పునరుద్ఘాటించారు.

ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం సంస్కృతి, ప్రామాణికాలు, ఆయుర్వేద-సంప్రదాయ ఔషధాలు, విదేశాంగ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సంయుక్త కమిషన్ వ్యవస్థకు సంబంధించిన నాలుగు ఎంవోయూలను పరస్పరం మార్చుకున్నారు. ప్రధానమంత్రి గౌరవార్థం అధ్యక్షుడు మహామా అధికారిక విందు ఏర్పాటు చేశారు. ఆయన ఆతిథ్యానికి ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. ఇద్దరికీ అనుకూలమైన సమయంలో భారత్‌ను సందర్శించాలని అధ్యక్షుడు మహామాను ప్రధాని ఆహ్వానించారు.

## కోడలు ఆత్మహత్య.. మామ హఠాన్మరణం

పెద్దవంగర, జులై 4:: మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన వేముల సంతోష్ కు 2011 లో మంచిర్యాలకు చెందిన ఝాన్సీ (30) తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు అఖిల్ తేజ్, అభిదామిని ఉన్నారు. సంతోష్ స్థానికంగా సీఆర్పీ గా విధులు నిర్వహిస్తున్నాడు.

ఝాన్సీ తొర్రూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్ గా పనిచేస్తుంది. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఝాన్సీ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడింది. కోడలు మరణ వార్త విన్న మామ వేముల లక్ష్మయ్య (70) తీవ్రగ్భ్రాంతికి లోనై అక్కడికక్కడే గుండెపోటు తో మృతిచెందాడు. కొన్ని గంటల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

**-గత ప్రభుత్వం వల్లే భూ వివాదాలు పెరిగాయని విమర్శ**
**-తహసీల్దార్ కార్యాలయాల్లో అర్జీల పెండింగ్‌పై సీరియస్**
**-శాఖలో భారీ మార్పులు, టెక్నాలజీ వాడకంపై దృష్టి**
**-అధికారులకు చంద్రబాబు దిశ నిర్దేశం**



అమరావతి, జులై 4: రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండటంపై అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై నేడు నిర్వహించిన కీలక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ శాఖ పనితీరు సంతృప్తిగా లేదని తేల్చి చెప్పారు.

గత పాలకుల వైఫల్యాల కారణంగానే రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ వివాదాలు, సర్వే సమస్యలు తీవ్రమయ్యాయని చంద్రబాబు ధ్వజమెత్తారు. తహసీల్దార్ కార్యాలయాల్లో వేల సంఖ్యలో అర్జీలు పరిష్కారానికి నోచుకోకుండా పేరుకుపోవడంపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత రావాలంటే భూ సమస్యలను వేగంగా పరిష్కరించడం, సేవలను సులభతరం చేయడం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

మహానాడులో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలోగా భూ సమస్యలను పరిష్కరించి తీరుతామని ఈ సందర్భంగా చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేవలం పైపైన మార్పులు కాకుండా, క్షేత్రస్థాయి నుంచి రెవెన్యూ శాఖలో సమూల ప్రక్షాళన చేస్తే తప్ప ఫలితాలు రావని అన్నారు. సిబ్బంది కొరత, పనిభారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని సూచించారు.పని తీరును మెరుగు పరుచు కుంటే ప్రజలకు మరింత చేరువ వ్వాలని అధికారులను కోరారు.. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పేరుకు పోయిన ఫైళ్లకు మోక్షం కలిగించాలని అన్నారు.. అలాగే పరిశీలనకు వచ్చిన ప్రతి ఫైల్ ను వేగంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపాలని సూచించారు.

# బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 4:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ఘనా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తొలి భారత ప్రధానమంత్రిగా ఆయన నిలిచారు. పార్లమెంట్ స్పీకర్ గౌరవనీయ అల్బన్ కింగ్స్‌ఫోర్డ్ సుమనా బాగ్బిన్ నిర్వహించిన ఈ సమావేశానికి పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఇరు దేశాల నుంచి విశిష్ట అతిథులు హాజరయ్యారు. ఈ ప్రసంగం భారత్-ఘనా సంబంధాల్లో ఒక ముఖ్యమైన సందర్భంగా నిలిచింది. ఇది రెండు దేశాలను ఏకం చేసే పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించింది.

భారత్-ఘనా మధ్య చారిత్రక బంధాలు.. స్వాతంత్ర్యం కోసం సాగించిన ఉమ్మడి పోరాటాల ద్వారా, ప్రజాస్వామ్యం, సమ్మిళిత అభివృద్ధి పట్ల ఉమ్మడి నిబద్ధత ద్వారా ఏర్పడ్డాయని ప్రధానమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. తనకు జాతీయ పురస్కారం అందించిన ఘనా అధ్యక్షుడు గౌరవనీయ జాన్ డ్రమానీ మహామాకు.. ఆ దేశ ప్రజలకూ శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని శాశ్వత స్నేహానికి చిహ్నంగా ఆయన అభివర్ణించారు. ఘనా దేశ మహా నేత డాక్టర్ క్వామే ఎన్‌క్రుమా సేవలను ప్రస్తావిస్తూ.. ఐక్యత, శాంతి, న్యాయం వంటి ఆయన ఆదర్శాలు బలమైన, శాశ్వత భాగస్వామ్యాలకు పునాది అని వ్యాఖ్యానించారు.

"మనల్ని ఏకం చేసే శక్తులు అంతర్గతమైనవి.. మనల్ని వేరు చేసే స్వాభావిక ప్రభావాల కంటే గొప్పవి" అని ఒకప్పుడు డాక్టర్ ఎన్‌క్రుమా చెప్పిన మాటలను ప్రధానమంత్రి ఉటంకించారు. ప్రజాస్వామ్య సంస్థల నిర్మాణం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రభావాన్ని ఆయన చాలా గొప్పగా వివరించారన్నారు. ప్రజాస్వామ్యానికి తల్లిగా భారత్ ప్రజాస్వామ్య నీతిని తన సంస్కృతిలో భాగంగా చేసుకున్నదని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత్‌లోని లోతైన, శక్తిమంతమైన ప్రజాస్వామ్య మూలాలను ప్రధానంగా ప్రస్తావించారు. భారత్‌లో గల భిన్నత్వం, ప్రజాస్వామ్య బలం భిన్నత్వంలో ఏకత్వపు శక్తికి నిదర్శనంగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఘనా దేశపు ప్రజాస్వామ్య ప్రయాణంలోనూ ఈ విలువ ప్రతిధ్వనిస్తుందన్నారు. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, మహమ్మారులు, సైబర్ మోసాల వంటి ఒత్తిళ్లతో కూడిన ప్రపంచ సవాళ్లనూ ఆయన ప్రస్తావించారు. ప్రపంచ వేదికలపై గ్లోబల్ సౌత్ సమష్టిగా గళం వినిపించాలని శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూపులో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు.

ఘనా దేశంలోని శక్తిమంతమైన పార్లమెంటరీ వ్యవస్థను ప్రధానమంత్రి ప్రశంసించారు. రెండు దేశాల చట్టసభల మధ్య పరస్పర సహకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఘనా-భారత్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ సొసైటీ ఏర్పాటునూ ఆయన స్వాగతించారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే భారత ప్రజల సంకల్పాన్ని వివరించిన ప్రధానమంత్రి.. ఘనా పురోగతి, శ్రేయస్సు కోసం భారత్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## పోలీసు కార్యాలయంలో రోశయ్య జయంతి వేడుకలు.. నివాళు లర్పించిన అదనపు ఎస్పీ

సంగారెడ్డి, జులై 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని పురస్కరించుకుని ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను అదనపు ఎస్పీ సంజీవ్‌రావ్ గుర్తు చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిన అడిషనల్ ఎస్పీ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. రోశయ్య దేశ రాజకీయ వేత్తఅని అన్నారు.

గుంటూరు జిల్లా తెనాలి మండలం వేమూరులో 1933లో జన్మించిన ఆయన.. విద్యార్థి నాయకుడిగా ఎదిగారని తెలిపారు. 2009-2010 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన రోశయ్య.. 2011-2016 వరకు తమిళనాడు గవర్నర్‌గా, కర్ణాటక రాష్ట్రానికి (అదనపు గవర్నర్)గా బాధ్యతలు నిర్వర్తించారని సంజీవ్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి కల్యాణి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్.ఐ. డానియెల్, ఎస్.బి. ఎస్.ఐ. యాదవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాలో తాగునీటి కష్టాలకు చెక్ - పవన్ కల్యాణ్

**-రూ.1290 కోట్లతో నిర్మించే ప్రాజెక్ట్ కు పవన్ శంకుస్థాపన**
**-చిన్నప్పుడు రెండేళ్లు ఇక్కడే ఉన్నానన్న ఉప ముఖ్యమంత్రి**
**-కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉండేదని వెల్లడి**
**-ఫ్లోరైడ్ భయంతో ఆరు నెలలకే ఊరు వదిలి వెళ్లామన్న పవన్**
**అప్పటి నుంచి ఇప్పటికీ తాగునీటి సమస్య ఉండటంపై ఆవేదన**




అమరావతి, జులై 4:ప్రకాశం జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలతో తనకు వ్యక్తిగత అనుబంధం ఉందని, ఆ సమస్య తీవ్రత తనకు బాగా తెలుసని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మార్కాపురంలో నిర్మించే జిల్లా పశ్చిమ ప్రాంతానికి తాగునీటిని అందించే ప్రాజెక్టుకు నేడు పవన్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టును రూ.1,290 కోట్లతో చేపడుతున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

చిన్నప్పుడు సుమారు రెండేళ్ల పాటు ఈ ప్రకాశం జిల్లాలోనే ఉన్నానని అన్నారు. ముఖ్యంగా కనిగిరి ప్రాంతంలో నివసించేవాళ్లమని పేర్కొన్నారు. అక్కడి నీటిలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉందని, దానివల్ల మోకాళ్లు, వెన్నెముకలు వంగిపోయే ప్రమాదం ఉందని చెప్పారు.. ఈ విషయం తెలియడంతో, కేవలం 6 నెలల్లోనే తమ కుటుంబం ఆ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లామని వివరించారు.

అప్పటి నుంచి ఇప్పటికీ ఆ ప్రాంతంలో తాగునీటి సమస్య కొనసాగడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ సమస్య కారణంగా అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే ఈ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. తాను ఎదుర్కొన్న సమస్యను ఇప్పుడు ప్రజాప్రతినిధిగా పరిష్కరించే అవకాశం రావడంపై పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు.

కుత్తుకలు కోస్తాం అంటే సహించేది లేదు..

గత జగన్ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాని అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులని పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలి వేశారని విమర్శించారు. గత పాలకులు రౌడీయిజం, గుండాయిజం చేశారని ధ్వజమెత్తారు.

తమ ప్రభుత్వం కక్ష తీర్చుకునేది కాదని, తప్పులు చేస్తే శిక్షించే ప్రభుత్వమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా కోపం లేదని చెప్పుకొచ్చారు. కుత్తుకలు కోస్తాం అనే వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని అన్నారు. మళ్లీ అధికారంలోకి ఆ పార్టీ నేతలు ఎలా వస్తారో చూద్దామని చెప్పారు. వైసీపీకి 151 సీట్లు వచ్చి? తాను రెండు చోట్ల ఓడినప్పుడు కూడా వారిని ఎదిరించానని గుర్తుచేశారు. సినిమా డైలాగులు నిజజీవితంలో బాగుండవని చెప్పుకొచ్చారు. తలదించుకుని పనిచేస్తున్న వారిని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సామాన్యులను బెదిరించడం వల్లే వైసీపీకి ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు పవన్ కల్యాణ్.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయండి : మల్లిఖార్జున ఖర్గే



హైదరాబాద్, జులై 4:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకోవడంతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ నేతలకు ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. గాంధీభవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. దాదాపు 2 గంటల పాటు సాగిన ఈ సమావేశానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఏసీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

అనంతరం ఖర్గే మాట్లాడుతూ నేతల మధ్య విభేదాలుంటే పార్టీలోని చర్చించుకోవాలని బయట మాట్లాడవద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలకు అవకాశం ఇవ్వవద్దని సమస్యలుంటే ఇన్ చార్జి నేతలతో కోఆర్డినేట్ చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, జిల్లాల్లో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు, సంవిధన్ బచావో కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు.

## ఖర్గేతో బీసీ నేతల భేటీ:

గాంధీ భవన్ కు వచ్చిన మల్లికార్జున ఖర్గేతో బీసీ సంఘాల నేతలు భేటీ అయ్యారు. బీసీ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఖర్గేను కలిసిన బీసీ నేతలు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, జాతీయ స్థాయిలో కులగణన అంశాలు, ఢిల్లీకి అఖిలపక్షం తదితర బీసీ డిమాండ్లను ఖర్గే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మల్లికార్జున ఖర్గేకు వినతిపత్రం అందజేశారు.

## దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం: కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, జులై 4:జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సామాజికంగా న్యాయం కోసం పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, కురుమ సంఘం ప్రతినిధులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న తొలి వీరయోధుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, రైతు హక్కుల కోసం ఆయన ప్రాణాలు అర్పించారన్నారు. ప్రతి ఒక్కరూ దొడ్డి కొమురయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.


# రోశయ్య సేవలు మరువలేనివి : అదనపు కలెక్టర్ సుధీర్



హైదరాబాద్, జులై 4:మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

పలువురు ముఖ్యమంత్రుల వద్ద ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను ప్రజలు మర్చిపోలేదని, అనంతరం ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవణాధికారి సత్తార్, జిల్లా విద్యాధికారి రేణుక దేవి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా యూత్ సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



నల్గొండ, జులై 4:విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. శుక్రవారం నిడమనూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే, మైనారిటీ గురుకుల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, సరుకుల నిల్వ రికార్డులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, పరుపుల ఏర్పాటు వంటి అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వసతి గృహం వంట గది, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు బస చేసే గదుల్లో ఫ్యాన్లు వంటి సౌకర్యాల కల్పనలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ప్రిన్సిపాళ్లు కె.రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, గిర్దావర్ సందీప్ ఉన్నారు.

# దట్టీలు సమర్పించిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, జులై 4:: షియా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే మొహర్రం సంతాప దినోత్సవాలు ప్రశాంతంగా కొనసాగడానికి తగిన చర్యలు తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మొహర్రం సంతాప వేడుకల్లో భాగంగా శుక్రవారం యాకుత్‌పురలోని బిబికా అలాంలో ప్రతిష్టించిన ఆలంలకు సీపీ దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రాతో కలిసి దట్టీలు సమర్పించారు. అనంతరం సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ..ఇరు వర్గాల వేడుకలు వెనువెంటనే వస్తున్నాయని, పర్వదిన నిర్వహణ కోసం క్షేత్ర స్థాయిలో ఇప్పటికే కసరత్తు నిర్వహించామని తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగడానికి తగిన సిబ్బందిని ఇతర ప్రాంతాల నుండి రప్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ జావీద్‌తోపాటు మీర్ చౌక్ ఏసీపీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య

**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ జూలై 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం లో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరు ద్యోగుల కష్టాలు కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు.అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా.. చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60 వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని ముఖ్యమంత్రిని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. ఓవైపు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడు అని నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే, మరోవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్లే వద్దంటున్నారని బుకాయించడం కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రికి నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి.

# పర్యావరణానికి, ప్రజలకు మేలు కలిగేలా మైనింగ్

-భూగర్భ జలాల పెంపుదలకు 'నీటి బిందువు-జలసింధువు'
-ఓసీ గనుల సమీప భూములకు సాగునీరు సరఫరా
-మూతపడిన గనుల భవంతులలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు
-ప్రతీ సమీప గ్రామంలో మెడికల్ క్యాంపులు, ఉపాధి హామీ పథకాలు
అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో సింగరేణి చర్యలను వివరించిన సీఎండీ ఎన్. బలరామ్

హైదరాబాద్, జులై 4:సింగరేణి సంస్థ తన బొగ్గు తవ్వకాలను పర్యావరణానికి నష్టం కలగకుండా, సమీప ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా నిర్వహిస్తోందని, సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల, సమీప ప్రాంతాల అభివృద్ధికి కూడా




పెద్దపీట వేస్తోందని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్. బలరామ్ తెలిపారు.

శుక్రవారం హైదరాబాద్ లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ మైన్ క్లోజర్ పద్ధతుల ద్వారా పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన సింగరేణి తరఫున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ అవలంబిస్తున్న విధానాలను వివరించారు.

సింగరేణి సంస్థ పర్యావరణకు హాని కల్పించని సర్ఫేస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్, డ్రాగ్ లైన్, కంటిన్యూయస్ మైనర్, లాంగ్ వాల్ వంటి మైనింగ్ టెక్నాలజీలని వినియోగిస్తుందని, నిబంధనల ప్రకారం మొక్కలు నాటుతూ వనాలుగా పెంచుతోందన్నారు ఇప్పటికే 7 కోట్ల 76 లక్షల మొక్కలను నాటడం జరిగింది అన్నారు.

బొగ్గు గనుల ప్రారంభం నుండి మూసివేత వరకు, ఆ తదుపరి కూడా మైన్ క్లోజర్ ప్లాన్ లను నిబంధనల ప్రకారం తు.చ తప్పకుండా అమలు జరుపుతున్నామని, యథాస్థితి పర్యావరణ పరిస్థితులకు, సమీప గ్రామాల అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు.

సింగరేణి ఓపెన్ కాస్ట్ నుంచి వచ్చే సుమారు 1,205 లక్షల కిలో లీటర్ల నీటిలో కంపెనీ అవసరాలు పోగా మిగిలిన 820 లక్షల కిలో లీటర్ల నీటిని స్థానిక ప్రజల అవసరాల కోసం వినియోగించడం జరుగుతు ందని, వీటిలో 465 లక్షల కిలో లీటర్ల నీటిని సమీపంలోని చెరువులు, కుంటలలోకి పంపించడం జరుగుతుందని మిగిలిన 330 లక్షల కిలో లీటర్ల నీటితో స్థానికులు తమ పంట పొలాలను సాగు చేస్తున్నారని తెలిపారు. మొత్తం మీద సింగరేణి సంస్థ అందించే నీటితో 13,625 ఎకరాలలో సేద్యం జరుగుతు ందన్నారు. అలాగే భూగర్భ జలాల పెంపుదల కోసం నీటి బిందువు-జల సింధువు అనే కార్యక్రమాన్ని చేపట్టి 62 కొత్త చెరువులను నిర్మించడం జరిగిందని, 45 పాత చెరువుల్లో పూడిక తొలగింపు చేపట్టామన్నారు. పాత గనులకు సంబంధించిన భవనాలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లను ప్రారంభించడం జరిగిందన్నారు.

మూసివేసిన ఓపెన్ కాస్ట్ గనుల నీటి సంపులలో నీటి నిల్వను కొనసాగించడం ద్వారా సమీప ప్రాంతాలలో భూగర్భ జలాల పెంపుదల సాధ్యమైందన్నారు. సమీప గ్రామాల నిరుద్యోగ యువతకు, మహిళలకు అనేక రకాల ఉపాధి అవకాశ శిక్షణలు ఉచితంగా అందించడం జరుగుతుందని, అలాగే ప్రతీ నెల సమీప గ్రామాల్లో ఉచిత మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

సింగరేణిలోని ఖాళీ ప్రదేశాల్లో ఇప్పటికే 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, రెండవ దశ ప్లాంట్లు పూర్తయిన తర్వాత సింగరేణి సంస్థ నెట్ జీరో కార్బన్ ఎమిషన్ కంపెనీగా గుర్తింపు పొందనున్నదని పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంప్ ల మీద కూడా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

గనులకు సమీపంలోని గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధి కోసం 20 వ్యవసాయ చెరువుల్లో పూడిక తొలగించడం జరిగిందని, సింగరేణి చేపట్టే భారీ ప్లాంటేషన్ పనులు, ఇతర ఔట్ సోర్సింగ్ పనుల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

మొత్తం మీద సింగరేణి సంస్థ పర్యావరణానికి కట్టుబడి, స్థానిక ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలను చేపట్టిందని వీటిని ఇకపై కూడా కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని డోర్లి- 1 ఓపెన్ కాస్ట్ మూసివేసిన తర్వాత చేపట్టిన పర్యావరణ చర్యలపై ఒక లఘు డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ప్రదర్శించారు.

సింగరేణితో పాటు కోల్ ఇండియా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ వారు, టాటా స్టీల్ కంపెనీ, వేదాంత, హిండాల్కో, ఎన్ఎండిసి వంటి ఇతర సంస్థలు, కొన్ని విదేశీ సంస్థలు తాము చేపడుతున్న మైన్ క్లోజర్ ప్లాన్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సదస్సులో ఛైర్మన్ తో పాటు సింగరేణి తరఫున డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ( ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ ) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

## ఘోరం.. హైవేపై కారును కిలోమీటర్ ఈడ్చుకెళ్లిన లారీ.. ఇద్దరు దుర్మరణం..!

న్యూఢిల్లీ, జులై 4:జాతీయ రహదారి పై వేగంగా వెళ్తున్న లారీ .. కారు ను పక్క నుంచి ఢీకొట్టింది. దాంతో లారీ కొక్కానికి కారు ఇరుక్కుపోయింది. అయినా డ్రైవర్ లారీని ఆపకుండా ఈడ్చుకెళ్లాడు. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. యూపీ లో సీతార్‌పూర్ ఏరియాలో జాతీయ రహదారి-30పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని సీజ్ చేసినట్లు వెల్లడించారు. కాగా గత నెలలో కూడా సీతార్‌పూర్ ఏరియాలో ఇదే జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. బియ్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి పక్కన వెళ్తున్న కారుపై పడటంతో.. అందులోని నలుగురు యువకులు తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయారు. వారిని బయటికి తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.

# రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై కేసీఆర్ ఆరా..



హైదరాబాద్, జులై 4:సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం గురువారం యశోద దవాఖానలో అడ్మిటైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు పార్టీ నేతలు పలువురు వచ్చారు. ఈ సందర్భంలో.. వారితో అధినేత కేసీఆర్ ఇష్టాగోష్టి నిర్వహించారు.

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా, ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు, తదితర ప్రజా సమస్యలు.. వర్తమాన అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ నేతలు, ఉద్యమకారుల నుంచి కేసీఆర్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

# బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలి : ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి



హైదరాబాద్, జులై 4: బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో జరుపుకొవాలని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ అవరణలో బోనాల నిర్వహణలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగను భక్తి భావంతో జరుపుకోవాలని, ఆలయాల వద్ద పెట్రోలింగ్‌ను పెంచడంతో పాటు నిఘాను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

బోనాల నేపథ్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసుల భాగస్వామ్యంతో పనిచేయాలని, అదేవిధంగా తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు.

ముఖ్యంగా బోనాల సందర్భంగా నిర్వహించే ఉరేగింపులో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలను ఉల్లంగిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, సాయిలుతో పాటు వివిధ అలయాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బైడెన్ ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలిచ్చాడు : డొనాల్డ్ ట్రంప్



న్యూఢిల్లీ, జులై 4:రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తూనే ఉంది. అయితే ఇటీవల తమ ఆయుధ నిల్వలను సమీక్షించిన అమెరికా.. ఉక్రెయిన్‌కు కొన్నిరకాల ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని పెంటగాన్ అధికారులు వెల్లడించారు.

ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ హయాంలో దేశం గురించి ఆలోచించకుండా ఉక్రెయిన్‌కు విపరీతంగా ఆయుధాలు అందజేశారని, దేశాన్ని ఖాళీ చేశారని ఆరోపించారు. దేశ భద్రతకు సరిపడా ఆయుధాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని.. అందుకే కీవ్‌కు అందజేయాల్సిన ఆయుధ సామాగ్రిపై కోత విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదట్లో ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం అంగీకరించిందని, అయితే ఇటీవల ఆయుధ నిల్వలను సమీక్షించిన రక్షణశాఖ.. కీవ్‌కు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయుధాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించిందని ట్రంప్ తెలిపారు. ఆయుధ కొరత కారణంగా ఉక్రెయిన్‌కు పంపాల్సిన పెండింగ్ షిప్‌మెంట్లను పంపించొద్దని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

కాగా బైడెన్ హయాంలో అమెరికా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధ, సైనిక సహాయాన్ని అందించింది. ఆయన పదవి నుంచి వైదొలగడానికి ముందు కూడా ఉక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో ఆర్థిక, ఆయుధ సాయం చేస్తామని ప్రకటించారు. రష్యా భూభాగంలో దాడులకు వీలుగా దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి కూడా అమెరికా నుంచి కీవ్‌కు అనుమతులు లభించాయి. ట్రంప్ అధ్యక్షుడు అయిన తర్వాత కూడా కీవ్‌కు ఆయుధ సాయాన్ని కొనసాగించారు. ఇప్పుడు నిలువలు తగ్గడంతో సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

## హవేలీ ఘన్‌పూర్‌లో ఎరువుల దుకాణాల తనిఖీ

మెదక్, జులై 4: మెదక్ జిల్లా హవేలీ ఘన్ పూర్ మండలంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం మెదక్ ఏడీ విజయ నిర్మల తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్ట్రర్‌లు, బిల్ బుక్కులను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు.


ఎరువుల దుకాణాల తనిఖీల అనంతరం పంట పొలాల్లో వరి నాట్లు, నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పొలంలో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు.

## భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

సమస్యలు ఉత్పన్నమవకుండా భూ భారతి రైతు సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం త్రిపురారం మండల తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, భూ భారతి దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతు సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పీఓటీ, పేరు తప్పు, ల్యాండ్ తక్కువ ఎక్కువ దరఖాస్తులను విడివిడిగా ఏర్పాటు చేసుకో వాలన్నారు.

అలాగే రైతులకు 7 రోజుల కాల వ్యవధిలో డాక్యుమెంట్లు సమర్పించే విధంగా నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నిజమైన రైతులకు అన్యాయం జరగకూడదని, గ్రామ గ్రామాన రైతుల చేతికి నోటీసులు స్వయంగా అందించి వారి వద్ద నుంచి డాక్యుమెంట్లను స్వీకరించాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ గాజుల ప్రమీల, నిడమనూరు తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, నాయబ్ తాసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐలు గుండెబోయిన సైదులు, బ్రహ్మదేవర సంతోష, సీనియర్ అసిస్టెంట్ కల్పన, సిబ్బంది ఉన్నారు.

# మడేలయ్య స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



కరీంనగర్, జులై 4: రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్య స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాల్వశ్రీరాంపూర్ మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి అన్నారు.

మండలంలోని పందిళ్ల గ్రామంలో రజకులు శుక్రవారం మడేలయ్య బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పులతో శివశక్తుల నృత్యాలతో పురవీధుల గుండా స్వామి ఆలయానికి చేరుకుని మొక్కులు సమర్పించుకున్నారు.

ఈ బోనాల వేడుకల్లో కాల్వ శ్రీరాంపూర్ మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఆశీస్సులతో మండల ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాడి పంటలు సక్రమంగా పండి వర్షాలు సమృద్ధిగా పండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.

## కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం.. మూడు జిల్లాల్లో అలెర్ట్

తిరువనంతపురం: కేరళలో మళ్లీ నిపా వైరస్ (ఔతిజూజీష్త్ర ఎతితీబీబ) కలకలం రేపుతున్నది. ఇద్దరు వ్యక్తుల్లో నిపా వైరస్ లక్షణాలు గుర్తించారు. దీంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మూడు జిల్లాల్లో అలెర్ట్ ప్రకటించారు. కోజికోడ్, మలప్పురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు అనుమానిత నిపా కేసులు వెలుగులోకి వచ్చాయి. మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలకు చెందిన వ్యక్తుల నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు.

కాగా, కేరళలో మరోసారి నిపా వైరస్ వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లో ఆరోగ్యపరంగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కాంటాక్ట్ ట్రేసింగ్, రోగ లక్షణాల గుర్తింపుతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ప్రాంతంలో 26 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఏవైనా అసహజ మరణాలు సంభవించాయా అన్నది తనిఖీ చేయాలని అధికారులను కోరినట్లు వివరించారు.

# లోకల్ పార్టీలకు ఈసీ షాక్ .. గుర్తింపు రద్దు చేస్తామంటూ నోటీసులు

హైదరాబాద్, జులై 4: తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది.

రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి చర్యలు ప్రారంభించింది. సంబంధిత పార్టీలకు నోటీసులు అందించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించింది.

ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# స్వీయ పరిశోధనలతో విద్యార్థులకు పేటెంట్ సాధ్యమే : ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



నల్గొండ, జులై 4:విద్యార్థులు సబ్జెక్ట్ నైపుణ్యాలు పెంచుకుని, స్వీయ పరిశధనలతో నూతన ఆవిష్కరణలు చేస్తే వాటికి పేటెంట్ తీసుకోవడం సాధ్యమేనని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూ సైన్స్ కళాశాలలో శుక్రవారం వర్సిటీ అండ్ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మేధో సంపత్తి హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందన్నారు. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ నివేద, చరణ్ తేజ్లు మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీ ఐపీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ దోమల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరివిరిగా మొక్కలు నాటాలి

పర్యవరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంజీయూ వీసీ అన్నారు. గతంలో నాటిన మొక్కలను సంరక్షణ చేయడంతోనే నేడు వర్సిటీ హరిత వనంలా పచ్చదనంతో కనిపిస్తుందన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'వనమహోత్సవం' నిర్వహంచడంతో వీసీ ముఖ్య అతిథిగా హాజరై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, వర్సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆకుల రవితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ హరీశ్‌కుమార్, ఆర్.మురళి, డాక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలి

మహబూబ్‌నగర్,జులై 4:ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పెట్టాలని తహసీల్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ విద్యార్థులు తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ విద్యాసంస్థల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని అన్నారు.

విద్యార్థులకు రూ. 8వేల కోట్లకు బకాయి ఉన్న స్కాలర్‌షిప్, రియింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులపై నియంత్రణ కరువైందని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో బాలుర, బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని, పాఠశాల కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థుల కోసం బస్సులు వేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని, మండల కేంద్రంలో ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ హాస్టల్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గౌస్, మండల కార్యదర్శి ప్రసాద్, కృష్ణ, అంజి, పాఠశాల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.